ప్రజాశక్తి

సోమవారం 29 మే 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

గొంతెండుతున్న గుంటూరు

గుజ్జనగుండ్ల సెంటర్‌లోని రిజర్వాయర్‌ల వద్ద నీటి తరలింపు కోసం ఉంచిన రిక్షాలు

- వెంటాడుతున్న తాగునీటి కష్టాలు
- అడుగంటిన భూగర్భ జలాలు
- క్యాన్ వాటర్‌పై ఆధారపడుతున్న జనం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులోని అపార్ట్‌మెంట్ల వాసులు నీటికి కటకటలాడుతున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో నీటి కష్టాలు పెరిగాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ (జిఎంసి) పరిధిలో పలుచోట్ల అనధికారికంగా బోర్లు వేస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. పలుచోట్ల 300 నుంచి 400 అడుగులపైగా లోతుకు బోర్లు వేశారు.

అధికారుల సమాచారం ప్రకారం జిఎంసి పరిధిలో 4,500 అపార్ట్‌మెంట్లున్నాయి. వీటిలో దాదాపుగా 3 నుండి 4లక్షల వరకు ప్రజలు నివసిస్తున్నారు. ప్రస్తుతం గుంటూరు నగర జనాభా 9.25 లక్షలకు చేరిందని అధికారుల అంచనా. మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డుతో పాటు బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం, బ్రాడీపేట, అరండల్‌పేట, నల్లపాడు, గోరంట్ల, నగరాలు, అమరావతి రోడ్డు, పలకలూరు రోడ్డు, ఏటి అగ్రహారం, గుజ్జనగుండ్ల, చంద్రమౌళినగర్, విద్యానగర్, వికాస్ నగర్‌లలో వందలాది అపార్ట్‌మెంట్లు వెలిశాయి. పెరిగిన జనాభాకు అనుగుణంగా మంచినీటి లభ్యత రోజురోజుకు పెరగాల్సింది పోయి తగ్గిపోతోంది. నగరపాలక సంస్థ పైపులైన్లు లీకులు ఏర్పడి తరచూ మరమ్మతులు జరుగుతున్నాయి. రోజుకు గంటకు పైగా నీటి సరఫరా

▶ 2లో

ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, ఫ్యాప్టో నాయకులు

ప్రమోషన్లు మాన్యువల్‌గా నిర్వహించాలి

డిఇఒ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల ప్రమోషన్లు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించాలని, బదిలీలు, ప్రమోషన్లు విడివిడిగా నిర్వహించాలని ఫ్యాప్టో చైర్మన్ ఎం.కళాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బదిలీలలోని అసంబద్ధతను సవరించాలని ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఆదివారం డిఇఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం డిఇఒ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.నిర్మలకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కళాధర్ మాట్లాడుతూ ప్రమోషన్ల విషయంలో ప్రభుత్వం ఒక నిర్దిష్ట విధానం పాటించకుండా గందరగోళం సృష్టించటం, ప్రమోషన్లు ఖాళీలు చూపకుండానే అంగీకారం కోరటం వల్ల ఉపాధ్యాయులు ఎక్కువ మంది ప్రమోషన్లను తిరస్కరిస్తున్నారన్నారు. ఫ్యాప్టో కో-చైర్మన్ జి.మోహనరావు మాట్లాడుతూ బదిలీల విషయంలో సంఘాలతో జరిపిన చర్చల్లో అంగీకరించిన విషయాలు ఉత్తర్వులలో లేవని, ఉత్తర్వులలో ఉన్న విషయాలు ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో లేవని అన్నారు. కావున బదిలీల జిఒలోని అసంబద్ధాలను సరిచేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో నాయకులు బసవలింగారావు మాట్లాడుతూ ప్రమోషన్లు సీనియారిటీ లిస్టులు, ఖాళీలు ముందుగా చూపి, మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తే ఏ సమస్యా లేకుండా ప్రమోషన్లు విజయవంతం అవుతాయన్నారు. బదిలీ ప్రభావం ఉపాధ్యాయులపై 8 ఏళ్లు ఉంటుందని, బదిలీ సక్రమంగా జరగని పక్షంలో ఉపాధ్యాయుడు 8 ఏళ్లు నష్టపోయే అవకాశం ఉందని, కావున బదిలీల జిఒలోని అసంబద్ధాలను తొలగించాలని ఖాళీలు అన్నీ బదిలీలకు చూపాలని, బ్లాకింగ్ విధానం మానుకోవాలని అన్నారు. పల్నాడు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సంపత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆందోళనను పట్టించుకోకుండా ముందుకు పోవటం వల్ల పోరాటం ఉధృతం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు బి.ఆదిలక్ష్మి, నరసింహారావు, ఖలీద్, సిహెచ్.నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి ఆహ్వానం లేకపోవడంపై

అంబేద్కర్ విగ్రహం వద్ద పలు పార్టీల నిరసన

ప్రజాశక్తి-సత్తెనపల్లి

భారత పార్లమెంటు నూతన భవనానం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిని ఆహ్వానించకుండా ప్రధాని నరేంద్ర మోడీ మాత్రమే ప్రారంభించడం తగదని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు గద్దె చలమయ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, జై భీమ్ భారత్ పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ప్రథమ పౌరులు రాష్ట్రపతి అయిన ద్రౌపది ముర్మును గిరిజన మహిళ అనే కారణంతో పార్లమెంట్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించకుండా వివక్ష చూపారని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటినుండి ప్రజల మధ్య కుల, మత

▶ 2లో

స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

- 10లోగా తనిఖీకి రావాలి
- అటెండర్లను ఏర్పాటు చేసుకోవాలి
- రవాణశాఖ వార్షిక ఆదాయం లక్ష్యం రూ.403 కోట్లు
- ప్రజాశక్తితో జిల్లా రవాణా అధికారి కరీం



8లో

బేతపూడిలో ఎల్ఇడి వీధిలైట్ల ఏర్పాటు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

బేతపూడిలో నూతన ఎల్ఇడి వీధి లైట్లు ఏర్పాటు చేశారు. బేతపూడి శివారు నుంచి నిడమర్రు రోడ్డు వరకూ కొన్నేళ్లుగా వీధిలైట్లు లేక స్థానికులు రాకపోకలకు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రయితే రహదారి చిమ్మచీకటిగా మారి ఎదురెదురుగా వచ్చే ద్విచక్ర వాహనదారులు ఢీకొని గాయాలపాలైన ఘటనలూ లేకపోలేదు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు వీధిలైట్లు ఏర్పాటు చేయించాలని ఇటీవల ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బేతపూడి రహదారి మార్గంలో ఎల్ఈడీ వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. దీంతో అధికారులు బేతపూడి బీటీ రోడ్డు వెంబడి ఎల్ఈడీ వీధిలైట్లు ఏర్పాటు పూర్తి చేశారు.

విజయ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాకలో ఆదివారం విజయ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మంగళగిరి సమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విజయ హెల్త్ కేర్ ట్రస్టు, బిసి సంక్షేమ సంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంగళగిరి తహశీల్దార్ రాంప్రసాద్, రెడ్‌క్రాస్ చైర్మన్ అనిల్ చక్రవర్తి, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మహేష్, గాజల శ్రీనివాస్ ప్రారంభించారు. శిబిరంలో షుగర్, బిపి, ఇసిజి, ఎకో పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయ హెల్త్ కేర్ ట్రస్టు ఫౌండర్ కాగితాల స్వాతిగౌడ్, బిసి సంక్షేమ సంఘం నాయకులు ఆళ్ల శివాజీయాద్, ఉడతా శ్రీనివాస్, నరసింహారావు పాల్గొన్నారు.

వికలాంగులకు వాహనాలు పంపిణీ

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

వికలాంగులకు మూడు చక్రాల వాహనాలను స్థానిక వైసిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కె.వెంకటరోశయ్య ఆదివారం అందించారు. ప్రతి నియోజకవర్గానికి 10 స్కూటీలను ప్రభుత్వం అందిస్తోందని, ఒక్కో వాహనం విలువ రూ.1.20 లక్షలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర డిఫరెంట్లీ ఏబుల్డ్ - సీనియర్ సిటిజన్స్ అసిస్టెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పటాన్, అల్లా బాషా, ఎ.వెంకటేశ్వరరావు, బి.రంగారావు, షేక్ మాము, ఆదిశేషులు, పి.రంగారావు, మూర్తిరాజు, గోపి పాల్గొన్నారు.

ఘనంగా విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ :నాటి జ్ఞాపకాలతో పెదనందిపాడు జడ్పీ పాఠశాల 1986-87 పదో తరగతి విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో సందడి చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి ప్రస్తుతం కొండపాటూరు ఎంపియుపి పాఠశాల హెచ్‌ఎం పనిచేస్తున్న శీలం అంకారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనంలో నాటి 154 మంది పాల్గొని తమకు చదువు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

జ్ఞాపకాల సంతోషం.. తెలియని భావోద్వేగం

40 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు - నాటి గురువులకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

దాదాపు 40 ఏళ్ల క్రితం వారంతా పదోతరగతి విద్యార్థులు. అప్పటి గురువులను, మిత్రులతో గడిపిన జ్ఞాపకాలు స్మరించుకోవాలనుకున్నారు. తలచిందే తడవుగా వృత్తి, ఉద్యోగాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారి చిరునామాలు, అప్పటి గురువుల సమాచారం కూడా సేకరించారు. ఎట్టకేలకు ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో సమావేశమయ్యారు. బాపట్ల జిల్లా మండూరురెడ్డి ఉమామహేశ్వరరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం వివరాలిలా ఉన్నాయి.

గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉండి ప్రస్తుతం బాపట్ల జిల్లాలో చేరిన చుండూరు మండలం మండూరురెడ్డి ఉమామహేశ్వరరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-83లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించారు. బ్యాచ్‌లోని వెన్నం కిషోర్, సీతారామయ్య, రేణుక, విజయ, ఎం.శేషగిరి సమిష్టి కృషితో బ్యాచ్‌లోని విద్యార్థుల వివరాలు సేకరించారు. అప్పటి ఉపాధ్యాయులు టి.వి.గురునాథం (సైన్స్), వెంకట్రావ్ (తెలుగు), బ్రహ్మానందం (మాథ్స్), మాచిరాజు రామకృష్ణమూర్తి (సోషల్), విజయకుమారి, సూర్యనారాయణ (పిఈటి) వివరాలు సేకరించి, వారిని కూడా సమావేశానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు భావోద్వేగానికి గురయ్యారు. 40 ఏళ్ల తరువాత ఒక వేదికపైన చేరిన పూర్వ విద్యార్థులంతా తొలుత వారి వృత్తి, ఉద్యోగం, కుటుంబ నేపథ్యాలను సభావేదికపై పంచుకున్నారు. ఈ సందదర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 40 ఏళ్ల తరువాత కూడా తమను గుర్తుపెట్టుకుని, వేదికపై చేర్చి సన్మానించటం మధురమైన అనుభూతిగా చెప్పారు. విద్యార్థులు సామాజిక సేవా దృక్పథం అలవాటు చేసుకోవాలని తను నేర్పించానని, అదే స్ఫూర్తితో ఉద్యోగ విరమణ అనంతరం కూడా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి శాఖ అధ్యక్షునిగా సేవలందిస్తున్నట్లు మాచిరాజు రామకృష్ణమూర్తి చెప్పారు. కుటుబంలో పిల్లలతోపాటు, పాఠశాల్లో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తమవంతు కృషిచేసినట్లు టివి గురునాథం చెప్పారు. అప్పట్లో మ్యాథ్స్ ఉపాధాయునిగా తొలి పోస్టింగ్ పొంది, తనను తాను నిరూపించుకునే అవకాశం దక్కిందని బ్రహ్మానందం చెప్పగా, సీనియర్ ఉపాధ్యాయులతో కలిసి పనిచేసే భాగ్యం దక్కిందని విజయకుమారి చెప్పారు. 40 ఏళ్ల తరువాత విద్యార్థుల చేతిలో సత్కారం పొందటం, వారి అభివృద్ధిని స్వయంగా వీక్షించటంలో ఎంతో సంతృప్తి ఉందని తెలుగు ఉపాధ్యాయులు వెంకట్రావ్ చెప్పారు. ఫిజకల్ ఎడ్యుకేషన్ ప్రాధాన్యతను, తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన తీరును పీఇటీ సూర్యనారాయణ వివరించారు. పూర్వ విద్యార్థులు వెన్నం కిషోర్, సీతారామయ్య, శ్రీకాళహస్తి ఏపిట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియ్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం.శేషగిరి సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గురవులకు నూతన వస్త్రాలను బహూకరించి, సత్కరించారు. అప్పటి బ్యాచ్‌లో తమతోపాటు పదోతరగతి చదివి, మృతి చెందిన నలుగురు విద్యార్థులకు తొలుత వారంతా మౌనం పాటించారు. సభా కార్యక్రమం అనంతరం పూర్వ విద్యార్థులంతా మండూరులో వారు చదువుకున్న పాఠశాలను సందర్శించారు.



పూర్వవిద్యార్థులతో అప్పటి గురువులు

మానసికోల్లాసం, దేహదారుఢ్యానికి ఈత దోహదం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో క్రీడలు ఉన్నప్పటికీ శారీరక, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసంతో పాటు విస్తృతమైన ఉపాధి అవకాశాలు కూడా పొందగలిగే క్రీడల్లో స్విమ్మింగ్‌ది ప్రత్యేక స్థానమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెల రోజులుగా నిర్వహించిన వేసవి ఈత శిక్షణా శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంవత్సరంలోని అన్ని కాలాల్లో ఒకే శీతోష్ణస్థితి ఉండే కృష్ణానది ఎన్టీఆర్ జిల్లాలో ఉండటం గర్వకారణమన్నారు. సాధారణంగా ఏదైనా ఒక క్రీడాంశంలో నైపుణ్యం సాధించిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్వల్పంగా ఉంటాయన్నారు. ఈతలో ప్రావీణ్యం సాధించిన వారికి నేవీ, వైమానిక దళం, మిలటరీ వంటి రంగాల్లో అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. సంస్థ నిర్వాహకులకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జీవితకాల అధ్యక్షులు గోకరాజు గంగరాజు మాట్లాడుతూ నెల రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణా శిబిరంలో 300 మందికి పైగా చిన్నారులు ఈత కొట్టడంలో సాధించిన నైపుణ్యానికి కారణమైన శిక్షకులను ఆయన అభినందించారు. సంస్థ అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 14 ఏళ్లుగా తమ సంస్థ ద్వారా వేలాది మంది శిక్షణ పొంది ఉన్నతమైన ఉపాధి అవకాశాలు పొందారని పేర్కొన్నారు. 5-15 ఏళ్ల పిల్లలకు శిక్షణిచ్చేందుకు నిర్వహించిన ఈ శిబిరంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా క్రమశిక్షణతో సాగిందన్నారు. అనంతరం చిన్నారుల శిక్షణలో ముఖ్యపాత్ర పోషించిన శిక్షకులకు, వలంటీర్లకు కలెక్టర్ ద్వారా జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.లక్ష్మీనరసరాజు, కోశాధికారి వి.వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షులు ఎల్.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎం.ఓబుల్‌రెడ్డి, అప్పలనాయుడు, రామచంద్ర రావు, జనార్ధనమూర్తి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఇఎన్‌టి సమస్యలు పట్టించుకోకపోతే తీవ్ర ఇబ్బందే!

ప్రజాశక్తి-గుంటూరు

చెవి, ముక్కు, గొంతు సమస్యలను చాలా మంది పట్టించుకోకుండా అవే తగ్గుతాయిలే అంటూ పట్టించుకోరని, అదే నిర్లక్ష్యం భవిష్యత్‌లో మిగతా శరీర భాగాల అనారోగ్యానికీ దారితీస్తాయని కావున సమస్య వచ్చిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజి, ఇఎన్‌టి సర్జన్ డాక్టర్ కె.రవి అన్నారు. ఆదివారం అవగాహన కార్యాలయంలో చెవి, ముక్కు, గొంతు సమస్యలపై అవగాహన సభ్యులు కళ్యాణం చంద్రశేఖర్ అధ్యక్షతన ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ రవి మాట్లాడుతూ ఆనందంగా జీవనం గడపాలంటే చెవి, ముక్కు, గొంతు కీలకమని అన్నారు. ఆ మూడిటికీ ఏ సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. చెవికి సంబంధించి బ్యాక్టీరియల్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయని, చెవిలో బడ్స్‌గానీ, ఇతర పరికరాలు వాడి గుబిలి తీసే ప్రయత్నం చేయకూడదని చెప్పారు. డాక్టర్ సలహా లేకుండా డ్రాప్స్ వాడకూడదన్నారు. చెవి నుండి మెదడుకు వెళ్లే నరాలు దెబ్బతినటం వల్ల, చెవి ఎముకల కండక్టవిటీ దెబ్బతినటం వల్ల వినికిడి సమస్యలు వస్తాయన్నారు. అధునాతన వినికిడి పరికరాల వల్ల కొంత మేరకు ఆ సమస్యను అదిగమించవచ్చని అన్నారు. ముక్కుకి వచ్చే ఇన్‌ఫెక్షన్లను నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలని, శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు ఏర్పడకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ రవిని అవగాహన సభ్యులు సన్మానించారు.

మాట్లాడుతున్న డాక్టర్ కె.రవి

గొంతెండుతున్న గుంటూరు

(మొదటి పేజీ తరువాయి)

జరగాల్సిన ప్రాంతాల్లో కూడా కుళాయిలకు 10 నిమిషాలు కూడా నీరు రాని పరిస్థితినెలకొంది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రోజు మార్చి రోజు నీరు వస్తున్న ప్రాంతాలు అధికంగా ఉన్నాయి. ఒకరోజు 30 నిమిషాలు సాఫీగా నీరు వస్తే రెండు రోజు సరిగా నీరు రావడం లేదు. క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన కొరవడింది. విద్యానగర్, చంద్రమౌళినగర్, బ్రాడీపేట, నగరాలు, గుజ్జనగుండ్ల, విద్యానగర్, అరండల్‌పేట తదితర ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గిపోయింది. కార్పొరేషన్ పరిధిలో 42 రిజర్వాయర్లు ఉన్నా తాగు నీరు చాలా చోట్ల అందరికి అందుబాటులోకి రాలేదు. కార్పొరేషన్ సరఫరా చేసే నీరు ప్రజల అవసరాలను తీర్చలేకోపోతున్నాయి. విలీన గ్రామాల్లో సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. గోరంట్ల కొండపై నిర్మిస్తున్న రిజర్వాయర్‌కు కనెక్షన్లు ఇవ్వడం ఇంకా పూర్తి కాలేదు. బోర్లున్నా నీరు అడుగంటి పోయిన వారు ట్యాంకర్ల ద్వారా నీటిని అపార్టుమెంట్‌లలోని సంప్‌లకు తెప్పించుకుని అక్కడి నుంచి ట్యాంకుకు ఎక్కించుకుంటున్నారు. అపార్టుమెంట్ వాసులు నెలకు ట్యాంకర్ నీటి కోసం రూ.15 నుండి 20 వేలకు పైగా చెల్లిస్తున్నారు. ట్యాంకర్ నీటిని ఇతర అవసరాల కోసం వినియోగిస్తున్నారు. తాగునీటి కోసం ప్రత్యేకంగా మినరల్ వాటర్ ముసుగులో 20 లీటర్ల క్యాన్ వాటర్‌కు ఒక్కో కుటుంబం నెలకు రూ.750నుంచి రూ.900 వరకు వెచ్చిస్తున్నారు. కార్పొరేషన్‌కు నీటి పన్ను చెల్లిస్తున్నా సరఫరా సక్రమంగా ఉండటం లేదు.

అంబేద్కర్ విగ్రహం వద్ద పలు పార్టీల నిరసన

(మొదటి పేజీ తరువాయి)

విద్వేషాలను రెచ్చగొడుతోందని, వాటి ఆధారంగానే రాజకీయాలు చేస్తోందని అన్నారు. రాజ్యాంగాన్ని అవమానిస్తూ దాని స్థానంలో మనువాదాన్ని అమలు చేయాలని రకరకాలుగా యత్నిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని దేశమంతటా 21 పార్టీలు బహిస్కరించాయని తెలిపారు. నిరసనలో డి.విమల, జె.రాజ్‌కుమార్, మస్తాన్‌వలి, ఆర్.పురుషోత్తం, ఎ.వీరబ్రహ్మం, ఎం.జగన్నాథరావు, ఎ.వెంకట్‌నారాయణ, ఎన్.వేణుగోపాల్, ఇర్మియ, సిహెచ్.చంద్రపాల్, డి.జ్ఞానరాజ్‌పాల్, కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెదకాకాని : విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొప్పురావూరు, నంబూరు రైల్వే స్టేషన్, టోల్గేట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పిహెచ్ ఖాన్ తెలిపారు.

అరవిందబాబుకు మరోసారి అవకాశం

- నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిగా ఆయనే ఖరారు
- ఆశావాహులను బుజ్జగించి కలిసి పని చేయాలని ఆదేశాలు
- మహానాడు వేదికగా టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ గత ఎన్నికలలో పోటి చేసి ఓడిపోయిన నిరాశ నిస్పృహలకు లోను కాకుండా అప్పటి నుండి ఇప్పటి వరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. నరసరావుపేట నియోజకవర్గ టిడిపి సీటు కోసం మరికొందరు ప్రయ త్నం చేస్తున్నారనే ఆరోపణలకు చెక్ పెడు తూ నరసరావుపేట నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా అరవిందబాబు పోటీ చేస్తారని, ఆశావహులు టిడిపి గెలుపు కోసం కృషి చేయాలని, అధికారంలోకి రాగానే గెలుపునకు కృషి చేసిన వారికి పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని చంద్రబాబు సూచించారని, వైసిపి అవినీతి,అక్రమాలపై పోరాటాలతో మెరుగైన పని తీరును ప్రదర్శించారని ప్రశంసలు కురిపించారని టిడిపి కార్యాలయ వర్గాలు తెలిపాయి. టిడిపి కార్యకర్తలకు ఆర్థికంగా, రాజ కీయంగా, సామాజికంగా ఎన్నో విధాల సహాయ సహకారాలు అందించారని చంద్రబాబు ప్రశంసించినట్టు తెలిపాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కార్యకర్తల సంక్షేమం చూసుకుంటూ వైసిపి నేతల అవినీతి అక్రమాలపై అలుపెరుగని పోరాటం సాగిస్తూ సామాన్య ప్రజలను సైతం ఆలోచింపజేసి టిడిపి సానుభూతిపరులుగా మార్చి మెరుగైన పనితీరును కనబరిచారని చంద్రబాబు మెచ్చుకున్నారని ప్రకటనలో తెలిపారు. నరసరావుపేట అసెంబ్లీ బరిలో బిసి అభ్యర్థికి అవకాశం ఇవ్వడం టిడిపికి కలిసి వచ్చే అంశం అని రాజకీయ విశ్లే షకులు సైతం చెబుతున్నారు. 2019 ఎన్ని కలలో అరవిందబాబు స్థానిక ఎమ్మెల్యే కు గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి గట్టి పోటీ ఇవ్వ గలిగారని, ప్రభుత్వ వ్యతిరేక పాలన ఎమ్మెల్యే అవినీతి అక్రమాలతో నరసరావు పేట ప్రజలు విసుగు చెంది ఉన్నారని ఏ సమస్య వచ్చిన ప్రజల పక్షాన నిలబడి పోరాడే అరవింద బాబును 2024 ఎమ్మె ల్యేగా చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు టిడిపి నాయకులు చెబుతున్నారు. బిసి అభ్యర్థి అయిన అర విందబాబుకు అవకాశం కల్పిస్తే నిధులు లేని కార్పొరేషన్‌లతో బీసీ నాయకత్వాన్ని బలహీన పరిచిన రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా అరవింద బాబును గెలిపించు కుంటామని బిసి నేతలు బాహటంగానే ప్రకటిస్తున్నారు. నరసరావ ుపేటలో అన్ని వర్గాల ప్రజలు అరవింద బాబు నాయకత్వాన్ని బలపరచడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

ప్రసంగిస్తున్న విల్సన్

పెరియార్ ఆలోచనలపై విస్తృత ప్రచారం

ఎన్జీవో హోంలో పెరియార్ రీడర్ పుస్తకపరిచయ సభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నేటి సమాజానికి పెరియార్ రచనలు ఎంతో అవసరమని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జాషువా పూలే పెరియార్ లిబరేషన్ ఫౌండేషన్ అధ్యక్షులు వి.విల్సన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హెూం లో జరిగిన పెరియార్ రీడర్ పుస్తకపరిచయ సభ జరిగింది. ఈ సభకు బి.విల్సన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఒకవైపు శాస్త్ర సాంకేతిక రంగాల్లో సమాజ వేగంగా ముందుకు వెళ్తున్నప్పటికీ దేశంలో

ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వాలు ప్రజల దష్టినీ మళ్లించడానికి మతోన్మాదం, కుల దురహంకారం, మూఢనమ్మకాలతో ప్రజలను మోసగిస్తున్నారని వివరించారు. కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ విధానాలతో యువతకు ఉద్యోగాలు కల్పించలేని ప్రభుత్వాలు జ్యోతిష్యం యోగ తదితర అశాస్త్రీయ కోర్సులను విశ్వవిద్యాలయాలలో ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. బాబ్రీ మసీదు, రామజన్మభూమి వివాదాలతో పాలకులు కాలక్షేపం చేస్తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో దేశానికి ఇ.వి.పెరియార్ రచనలు, తాత్వికత ఎంతో అవసరమని తెలిపారు ఈ సదస్సులో పిడిఎఫ్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనార్టీ హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పొ%అ%గుపాతి పూర్ణచంద్రరావు, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటా నాయక్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రెడ్డి పోయిన ప్రసన్నకుమార్ మాల మహానాడు ఏపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోదా గ్యాంగ్ పాల్, భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపాడిలాంబరం తదితరులు పాల్గొన్నారు ఈ సదస్సులో ప్రజా కళామండలి బందం పాడిన పాటలు సభాసదులను ఆకట్టుకున్నాయి.

పెట్రోల్ పోసుకుని కూతురు ఆత్మహత్య

- ఇంటి హక్కు విషయమై తల్లీకూతుళ్ల వివాదం
- ప్రత్తిపాడులో ఘటన • కేసు నమోదు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ఇంటి హక్కు విషయంలో తల్లీ కూతుర్ల మధ్య వివాదంలో కూతురు పెట్రోల్ పోసుకొని మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడుకు చెందిన చెన్న సుజాత(45) గత 15 సంవత్సరాలుగా భర్తతో కలిసి గ్రామంలో నివసిస్తోంది. ఆమె నివాసం ఉండే ఇంట్లోనే పక్క పోర్షన్లో ఆమె తల్లి ఆదిలక్ష్మి, అక్క కోటేశ్వరి నివాసం ఉంటున్నారు. అయితే ,గత కొంతకాలంగా ఆ ఇంటి హక్కు విషయంపై కూతురు సుజాతతో తల్లి ఆదిలక్ష్మికి తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో ఆదిలక్ష్మి, సుజాత, ఆమె భర్త నరేష్ బాబు పిల్ల లపై కూడా కేసు పెట్టింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆదిలక్ష్మి, కోటే శ్వరులు కలిసి వారి హద్దు వరకు గోడ నిర్మించుటకు కూలీలను తీసుకు వచ్చారు. ఈ విషయం గమనించిన సుజాత పెట్రోల్ నింపిన బాటిల్ ,అగ్గిపెట్టె తీసుకొని గోడ కడితే తాను చచ్చి పోతానంటూ పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. వెంటనే సుజాత కుమా రుడు తిరుమల తేజ ఆమెను ఆపేందుకు యత్నించిన ఫలి తం లేకుండా పోయింది. మంటల్లో కాలి పోతూ సుజాత కింద పడి పోయింది. చుట్టు పక్కల వారు 108కి ఫోన్ చేయడంతో వారు అక్కడికి వెళ్లారు. సుజాత చని పోయినట్లు నిర్ధా రించారు

ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా, వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సుచరితను తల్లి ఆది లక్ష్మి కలిసింది. తన కూతురు తన ఇంట్లో ఉం డనీయడం లేదని, తరచూ కొట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు కూతురిపై ఫిర్యాదు చేసింది.

'చంద్రబాబు దృష్టిలో మేనిఫెస్టో అంటే చిత్తుకాగితం'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు దృష్టిలో మేనిఫెస్టో అంటే చిత్తు కాగితంతో సమానమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. స్థానిక 26వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టో గురించి చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మేనిఫెస్టో అంటే ఏ పార్టీకి అయినా పవిత్రమైందిగా భావించాలని, తమ నాయకుడు జగన్, మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తాంని అన్నారు.

చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల సమయంలో 600కుపైగా హామీలతో మేనిఫెస్టోను రూపొందించి, ఒక్క హామీనీ కూడా నెరవేర్చకుండా తుంగలో తొక్కారని విమర్శించారు. మేనిఫెస్టోను కనపడనీకుండా చేశారన్నారు.టిడిపి హయాంలో బాబు మనుషులే ధనవంతులవుతారని, పేదలను ధనవంతులను చేస్తానంటూ చంద్రబాబునాయుడు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు.

ఆయన అధికారంలోకి వస్తే పేదలంతా మరింత నిరుపేదలుగా మారతారని, చరిత్రే అందుకు సాక్ష్యమని స్పష్టంచేశారు. ఎన్టీరామారావుకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబునాయుడు, ఆయన పేరును తన రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

చిలకలూరిపేటలోని 26వ వార్డులో గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విడదల రజిని

అమలు జరిపే నిజాయితీ లేదు : డొక్కా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని, అందువల్ల ఆ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో అమలు అయ్యే అవకాశం లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వర ప్రసాద్ పేర్కొన్నారు. గుంటూరులో ఆదివారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ 14 ఏళ్లు చంద్రబాబు అధికారంలో ఉన్నా ఎప్పుడూ నిజాయితీగా మేనిఫెస్టో అమలు చేయలేదన్నారు. వైసిపి అమలు చేస్తున్న పథకాల్లో స్వల్ప మార్పులు చేయడం తప్ప కొత్తగా ప్రజలను ఉద్ధరించేందుకు రూపొందించిన మేనిఫెస్టో కాదన్నారు. పేదలపట్ల చిత్తశుద్ధి లేదనడానికి తాజాగా ప్రకటించిన మేనిఫెస్టోనే ఉదాహరణగా పేర్కొన్నారు.

ఈతకెళ్లి ఎపిఆర్‌జెసి విద్యార్థి మృతి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్ లోని కృష్ణా జలాశయం లో ఈతకు దిగి స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం పర్రి గ్రామానికి చెందిన పురిటిపాటి సాయి రాఘవ రెడ్డి మాచర్ల మండలం విజయపురిసౌత్ లోని ఎపిఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం (సీఈసీ) చదువుతున్నాడు. సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు విజయపురిసౌత్ లోని ఎపిఆర్జెసి కి వచ్చాడు. ఆదివారం సెలవు కావడంతో 15 మంది స్నేహితులతో కలిసి సాగర్ కృష్ణ వేణి పుష్కర్ ఘాట్ వద్ద నదిలో స్నానం చేసేందుకు వచ్చాడు. నదిలోకి దిగి ఈత కొడుతుండగా నీటిలో మునిగిపోయాడు. దీంతో స్నేహితులు అతన్ని కాపాడేందుకు యత్నించిన ఫలితం లేకుండా పోయింది. సాయి రాఘవరెడ్డి స్నేహితులు చూస్తుండగానే అతను నదిలో కొట్టుకుపోయి మృతి చెందాడు. మృతుడి తండ్రి కోటిరెడ్డి హైదరాబాద్ లో ప్రయివేటు క్రేన్ ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్ ఐ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో యువ కూలి మృతి

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి మండల కేంద్రంలో పేరుబోయిన సాంబశివుడు వయసు (30) వ్యవసాయ కూలీ మృతి చెందారు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాంబశివుడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు గత రెండు, మూడు రోజుల నుంచి అనారోగ్యంతో బాధ పడుతూ ఆదివారం మధ్యాహ్నం మరణించాడు.

పేకాట స్థావరం పై దాడి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రతిపాడు మండలం పరిధిలోని చిన్నకోండ్రుపాడు గ్రామంలో ముందస్తు సమాచారంతో పేకాడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 7,500 నగదు, పేకముక్కలను స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీంద్ర తెలిపారు.

ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు రూరల్ గ్రామమైన దొప్పలపూడి గ్రామం నందు వేకువజామున అగ్ని ప్రమాద కారణంగా గ్రామానికి చెందిన మంచాల ముసలయ్య చావిడి, చావడిలో గల రెండు గేదెలు, రెండు దూడలు పూర్తి గా కాలిపోవడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య ఆదివారం దొప్పలపూడి గ్రామానికి వెళ్లారు. ప్రభుత్వం ద్వారా రావాల్సిన సహాయాన్ని వెంటనే అందజేస్తానని ముసలయ్య కుటుంబానికి హామీ ఇచ్చారు.

కొలతలు.. తప్పులతడకలు!

- 'భూ హక్కు- భూ రక్ష పథకంపై విమర్శలు
- రైతుల సమక్షంలో మళ్లీ కొలతలు వేయండి
- మానుకొండువారిపాలెం రైతుల విజ్ఞప్తి

మానుకొండువారిపాలెంలోని పొలంలో ఒకటి ఉండాల్సిన చోట రెండు హద్దురాళ్లు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

జగనన్న భూ హక్కు- భూ రక్ష పథకం ద్వారా తీసే కొలతలు తప్పుల తడకలే నంటూ రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో ఈ పథకం పూర్తయిన అన్ని గ్రామాల రైతులు ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒక పొలానికి రెండు గట్లు, మరోచోట డొంక లేకపోవడం, రోడ్లు సగానికి పైగా కొలత ఉండటం వంటి పూర్తి స్థాయి అవకతవకలతో కొలతలు పూర్తయ్యాయని అనిపించినట్లు ఉందన్నారు. రైతులందరి సమ క్షంలో మళ్లీ కొలతలు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులకు భూ యజమాని పాస్ పుస్తకం, పట్టాదారు పాస్ పుస్తకం ఇచ్చినా ఇంకా తప్పుల సవరణలో యూనిక్ నంబర్ కూడా ఇచ్చారన్నారు.

ఇటీవల కాలం నుంచి రెండు పుస్తకాలను కలిపి ఒక్కటిగా చేసి ఈ (ఎలక్ట్రానిక్) పుస్తకాలను ఇచ్చారన్నారు. అనుమానం వచ్చిన కొంత మంది రైతులు జీ కొలతలను వేయించుకున్నారు. మానుకొండువారిపాలెంలో అధికారులు కొలిచిన ప్రతి పొలం కొలత తగ్గడమో, పెరగడమో జరిగింది. చిలకలూరిపేట నివాసి ప్రసాదు, మానుకొండువారి పాలెంలో ఒక రైతు వద్ద రెండెకరాల పొలాన్ని మండల సర్వేయర్లతో కొలతలు వేయించి మరి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే, ఈ భూ రక్ష పథకంలో భాగంగా ఈ పొలాన్ని మళ్లీ కొలవగా 4

మానుకొండువారిపాలెంలోని పొలంలో రోడ్డు ఉన్నట్టుగా అమర్చిన హద్దురాయి

సెంట్లు తగ్గింది. ఈ విష యమై అధికారుల వద్దకు వెళ్లి ప్రశ్నించగా ఒకరి పై ఒకరు చెప్పు కుంటున్నారే తప్ప సమాధానం చెప్పడం లేదని అన్నారు. కొలతల సమయంలో తనకు చెప్పలేదని అన్నారు.

మానుకొండువారిపాలెంకు చెందిన రైతు 1972వ సంవత్సరం లో 8 ఎకరాల 4 సెంట్ల పొలం ఉన్న మరో రైతు వద్ద నుంచి అందులో సగము అంటే 4 ఎకరాల 2 సెంట్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో తేడాలు, వ్యత్యాసాలు రాకుండా ఉండేందుకు గాను అప్పట్లోనే మండల సర్వేయర్ల చేత జీ కొలతను వేయించినట్లు తెలిపారు. అయితే, ఈ భూ రక్ష పథకం కింద కొలవగా 20 సెంట్లు ఎక్కువ రావడంతో విస్తుపోయారు. విచిత్రమేమిటంటే ఆ చుట్టు పక్కల ఎవరికి భూమి కొలతలు తగ్గ లేదు, అదనంగా రాలేదు. మరో రైతు సుమారు నలభై ఐదేళ్ల క్రితం జీ కొలత వేయించానని, ఆ కొల తలనే మార్చి వేశారని చెప్పారు.

ఆ వివరాలు లేవు

మానుకొండువారిపాలెం విఆర్ఒ మాట్లాడుతూ గ్రామం మొత్తం వ్యవసాయ భూమి 1713.47 ఎకరాలను కొలిచామని, ఇందులో వాగు, పోరంబోకు, చెరువులు, డొంకలు ఉన్నాయిని, ఆ వివరాలు ప్రస్తుతం లేవని చెప్పారు.

హెచ్చుతగ్గులొస్తే కొలతలు వేయిస్తాం

తహశీల్దార్ జి.సుజాత మాట్లాడుతూ మొత్తంగా 15 గ్రామాల్లో సర్వే నిర్వహించాల్సి ఉండగా దాదాపు 8 గ్రామాల్లో పూర్తయినట్లు చెప్పారు. రైతులు నష్టపోవాలనే ఉద్దేశం తమకు లేదని, నాలుగు లేదా ఐదు సెంట్లు, అంతకు మించి హెచ్చుతగ్గులు వస్తే అర్జీలు పెట్టుకోవాలని, మళ్లీ కొలతలు వేయిస్తామని అన్నారు.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని కారుచోలలో జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సంస్థ చైర్మన్ షేక్ జాన్ సైదా ఆదివారం ప్రారం భించారు. శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో నాదెండ్ల మండలం మాజీ ఎంపిపి కంజుల వీరారెడ్డి ,15 వ వార్డు కౌన్సి లర్ జాలాది సుబ్బారావు,నాదెండ్ల మండల వైసిపి మాజీ అధ్యక్షులు గొంటు శ్రీనివాస రెడ్డి, ఎంపిటిసి భవనం విజయ లక్ష్మి ,మాజీ సర్పంచ్ ముగ్ధం తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు ప్రాధాన్యతం : ఎస్ఐ

ప్రజాశక్తి - పెదకూరపాడు

శాంతి-భద్రతలకు ప్రాధాన్యత ఇస్తామని పెదకూరపాడు ఎస్సై విప్పర్ల వెంకట్రావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు ప్రాధా న్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. బదిలీపై పెదకూరపాడు వచ్చిన ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను సహిం చనని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్ట విరుద్ధ మని, అటువంటి వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని చెప్పారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచ రిస్తూ ఉంటే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

అడవులను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మానవుల మనుగడ కోసం అడవులను సంరక్షించు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీ సర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు.విజయపురిసౌత్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గా సత్యనారాయణ నూతనంగా బాధ్య తలు చేపట్టిన అనంతరం ఆదివారం నాగార్జున కొం డను సం దర్శించారు. ముందుగా స్థానిక లాంచీ స్టేషన్ వద్ద మర మ్మతులకు గురైన ఫారెస్ట్ బోట్ ను పరిశీలించారు. అనం తరం కొండకు చేరుకొని కొండలోని అటవీ జంతువుల గురిం చి ఆరా తీశారు. పర్యాటకులకు అటవీ జంతువుల నుంచి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు,అటవీ భూము ల ఆక్రమణకు గురి కాకుండా సిబ్బంది పహా రా కాస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎఫ్బిఓ అనిల్ కుమార్ ఉన్నారు.

బడిలో మందుబాబుల పాడు పనులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మద్యం సీసాలు

ప్రభుత్వ పాఠశాలలు మందు బాబులకు నిలయంగా మారాయి. రాత్రి వేళ్ళలో మందుబాబులు యథే చ్ఛగా మద్యం సేవిస్తున్నారు. సత్తెన పల్లి మండలంలోని ప్రభుత్వ పాఠ శాలల ఆవరణలో మద్యం సేవిస్తూ అసాంఘిక కార్య కలా పాలకు పాల్పడుతున్నారు . భగుబండ జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ముందు బాబులు మద్యం సేవిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, మందు బాబులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

జిడ్డు కాలనీలో లో-ఓల్టేజి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని 38వ వార్డు జిడ్డు కాలనీలో గత కొన్ని నెల లుగా విద్యుత్ లో-ఓల్టేజ్ వలన ఎస్టి కాల నీ వాసులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖాధికారుల దృష్టికి పలు వురు నేతలు తీసుకువెళ్లిన సమస్య పరిష్కార దిశగా ఆలోచన చేయడం లేదని ఎపి గిరిజన సం ఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. శ్రీను నాయక్ అన్నారు. ఆదివారం ఎన్ ఆర్ టి సెంటర్‌లోని ఐక్య వేదిక కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ సమస్యను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినికి గడప..గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా చెప్పడంతో విద్యుత్ స్తంభాలు వేయడమే కాకుండా విద్యుత్ లైన్లను మరమ్మత్తులు చేయిస్తామని విద్యుత్ శాఖాఅధికారులు ఆమెతో చెప్పారని అన్నారు. అయితే, ఈ సమస్య నేటికీ అలాగే ఉందన్నారు. లో-ఓల్టేజ్ కారణంగా ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, కూలర్లు వంట వస్తువులు పాడైపోతున్నాయని, పాడైపోయిన వస్తు వులను తీసుకొని విద్యుత్ శాధికారుల కార్యా లయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వాలకు ఆదాయం సమకూర్చేందుకు ఆది వారం సైతం విద్యుత్ బిల్లులు కట్టించుకుంటామని మైకు ద్వారా ప్రచారం చేయిస్తున్న అధికారులు తమ కాలనీ పైన చిన్న చూపు ఎందుకో అర్థం కావడం లేదని ప్రశ్నించారు.

నత్త నడకన వీధి దీపాలు ఏర్పాటు

అంధకారంలో హైకోర్టుకు దారితీసే సీడ్ యాక్సెస్ రోడ్డు



ప్రజాశక్తి - తుళ్లూరు

హైకోర్టుకు దారి తీసే సీడ్ యాక్సెస్ రోడ్డు,ఇతర రహదారుల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు నత్తనడకన సాగుతోంది. విద్యుత్ దీపాలు లేకపోవడంతో రహదారులు అంథకారం అలముకుంది. హైకోర్టుకు దారితీసే మార్గాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని కోరుతూ ఏపి హైకోర్టు ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు ఎ.వేణుగోపాలరావు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేసిన హైకోర్టు వీధి దీపాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఆర్‌డిఎ కమిషనర్‌ను ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చేస్తున్నామని, జూన్ చివరి నాటికి వీధి దీపాల ఏర్పాటు పూర్తి అవుతుందని సిఆర్‌డిఎ తరుపు న్యాయవాది ఇటీవల కోర్టుకు నివేదించారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న కోర్టు విచారణను జూన్ 20 వ తేదీకి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో వీధి దీపాల ప్రక్రియ ప్రారంభైనా నత్త నడకన సాగుతోందనే విమర్శలు ప్రజల నుండి వినవస్తున్నాయి. హైకోర్టుకు దారితీసే సీడ్ యాక్సెస్ రోడ్డు పై న్యాయమూర్తులు, న్యాయవాదులు, రాజధాని గ్రామాలు ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. వీధి దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీధిదీపాలు ఏర్పాటు ప్రక్రియ త్వరిత గతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు సిఐటియు ఆవిర్భావ సభ

ప్రజాశక్తి-గుంటూరు

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక బ్రాడీపేట 2/7లోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మీనారాయణ, వై.నేతాజి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగారావు ముఖ్యవక్తగా పాల్గొంటారని, మతోన్మాదం-కార్మికవర్గంపై ప్రభావం అంశంపై ఆయన ప్రసంగిస్తారని పేర్కొన్నారు. కావున సిఐటియు అనుబంధ యూనియన్ల కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

31న సాహితీ కదంబం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 31న సాయంత్రం 5 గంటలకు స్థానిక బృందావన్ గార్డెన్స్, వెంకటేశ్వరస్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై సాహితీ కదంబం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ఎస్ఎం సుబానీ పేర్కొన్నారు. సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి నిర్వహణలో వడ్లమన్నాటి నాగజ్యోతి నాట్య ప్రదర్శన, రిటైర్డ్ డిఎస్‌పి డాక్టర్ గంటేల రవికుమార్ మాయసభ ఏకపాత్రాభినయం, పద్యగానం ఈవూరి వెంకటరెడ్డి, డాక్టర్ పెరుగుపల్లి బలరాం చేత పురాణ శ్రవణం తదతర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ర్యాలీలో చైర్‌పర్సన్, మెప్మా మహిళలు

మహిళల ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి

మహిళల ఆరోగ్య అవగాహన ర్యాలీ ఆదివారం పట్టణంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం అధ్యక్షతన జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఋతుక్రమ దినోత్సవం సందర్భంగా మహిళల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ పురవీధుల్లో కొనసాగింది. ర్యాలీలో మెప్మా విభాగం మహిళా సిబ్బంది, నగరదీపికలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-తాడేపల్లి

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న పురాణం వెంకటాచార్యులు

ఉండవల్లి హైస్కూల్లో పల్లెటూరు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా వైద్య శిబిరాన్ని చిన్నజీయర్ స్వామి ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాస తరంగిణి ద్వారా ఇప్పటివరకు 20 లక్షల మందికి పైగా మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించినట్లు చెప్పారు. రాష్ట్రాల ఎల్లలు దాటి తమ సేవలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పల్లెటూరు ఛారిటబుల్ ట్రస్టు ద్వారా చేస్తున్న వైద్య శిబిరంలో తాము కూడా భాగస్వామ్యం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ వైద్య శిబిరంలో సంధ్య కంటి ఆసుపత్రి, రామ్ ఆసుపత్రి, మీరావళి హార్ట్ ఆసుపత్రి, కెవిఎస్ మెమోరియల్ పిల్లల వైద్యశాల, అమృతసాయి డెంటల్ క్లినిక్ వైద్యులు, సిబ్బంది రోగులకు వైద్య సేవలందించారు. 250 మంది వైద్య శిబిరంలో పాల్గొని ఉచితంగా మందులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె నాయకులు అంబటి ఆంజనేయులు, చందు జనార్ధన్, సిపిఎం నాయకులు జొన్నా శివశంకర రావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మీరావలి, టిఎన్ఆర్, ట్రస్టు ఫౌండర్, చైర్మన్ జొన్నా రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు, సిపిఎం నాయకులు మాట్లాడుతూ పల్లెటూరు ఛారిటబుల్ ట్రస్టును అభినందించారు.

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ఎక్సలెన్స్ అవార్డు

ఢిల్లీ అసోచామ్ నేషనల్ కౌన్సిల్ సదస్సులో ప్రదానం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి మరో అరుదైన అవార్డు లభించింది. ఢిల్లీకి చెందిన అసోచామ్ నేషనల్ కౌన్సిల్ ఆన్ ఎడ్యుకేషన్ సంస్థ ఆదివారం సాయంత్రం ఢిల్లీలో నిర్వహించిన సంస్థ 16వ అంతర్జాతీయ విద్యా, నాయకత్వ - నైపుణ్యాభివృద్ధి సదస్సులో ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీకి 'ఎక్సలెన్స్ ఇన్ ఎనేబుల్ రీసెర్చ్ ఎన్విరాన్‌మెంట్' అవార్డును ప్రదానం చేసింది. అసోచామ్ సంస్థ ఛైర్మన్ కున్వర్ శేఖర్ విజయేంద్ర, కో-ఛైర్పర్సన్ ప్రొఫెసర్ రజిత్ కులకర్ణిలు ఈ అవార్డును అందజేశారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నుంచి సదస్సుకు హాజరైన డీన్ ప్రొఫెసర్ రంజిత్ థాపా, అసిస్టెంట్ డీన్ డాక్టర్ మహేశ్ రవ్వా, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియా అవార్డును అందుకున్నారు. విస్తృత పరిశోధనలకు వీలుగా తగినంత వనరులు సమకూర్చడమే కాకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్న యూనివర్సిటీగా పరిగణించి అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మనోజ్ కుమార్ అరోరా ఎస్అర్ఎం ప్రొఫెసర్లను అభినందించారు. పరిశోధనల పరంగా ముందుకు సాగుతున్న ప్రొఫెసర్ల కృషిని ప్రశంసించారు. ఎస్ఆర్ఎంలో అమలవుతున్న ఇంటర్ డిసిప్లినరీ విద్యా విధానం విద్యార్థుల ప్రగతికి దోహద పడుతుందని వీసీ మనోజ్ పేర్కొన్నారు. ఐదున్నరేళ్ల కిందట ఏర్పాటు చేసిన వర్సిటీ రీసెర్చ్ పరంగా పురోగతి సాధించడం అభినందనీయమని డీన్ ప్రొఫెసర్ రంజిత్ ధాపా పేర్కొన్నారు.

భవానిని సత్కరిస్తున్న సినీ రచయిత బుర్రా సాయిమాధవ్

రంగస్థల నటి భవానికి ఎన్‌టిఆర్ సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ ఎన్టీఆర్ ఉచిత సినిమాల రూపకర్త కొమ్మినేని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న శకపురుషుని శతజయంతి ఉత్సవాల్లో ఎన్టీఆర్ నటించిన 'దానవీరసూరకర్ణ' చిత్రాన్ని ఆదివారం ఉచితంగా ప్రదర్శించారు. గతేడాది మే 28న ప్రారంభించిన వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్ చలన చిత్రాలను ఉచితంగా ప్రదర్శిస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక జెఎంజె కళాశాల ఆధ్వర్యంలో ఆశ్రయం పొందుతున్న స్వధార్ హోమ్ అనాధలకు దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. పెదరావూరులో 50 అడుగుల ఎన్టీఆర్ భారీ కటౌట్‌ను ఎన్‌టిఆర్ అభిమానులు, టిడిపి కార్యకర్తలు ఏర్పాటు చేశారు. శతాబ్ది ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సత్కరించే కార్యక్రమంలో భాగంగా ప్రముఖ రంగస్థల నటి దేవరపల్లి భవానిను బుర్రా సాయిమాధవ్, కొమ్మినేని వెంకటేశ్వరరావు, పెమ్మసాని పోతురాజు, సిహెచ్ సింగరావు, ఎస్.సాంబశివరావు, ఇ.శ్రీనివాసరావు, ఎ.మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ఎం.రాఘవరావు, డి.భాస్కరరావు, జి.ప్రసాద్, ఎం.వెంకట్, ఎన్.శ్రీనివాస్, వసంతయామిని తదితరులు ఎన్టీఆర్ జ్ఞాపికను అందించి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆవుల చక్రవర్తి, డాక్టర్ వి.ఆదిశేషగిరిరావు, టి.హరిప్రసాద్, బి.వెంకట్, కె.శ్రీనివాసరావు, డి.నరసయ్య, కె.శ్రీనివాస్ పాల్గున్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఊరికి, బడికి ఏమైనా చేద్దాం..

పూర్వ విద్యార్థుల సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి - దుగ్గిరాల

విద్యార్థులను ఆదుకునేందుకు కమిటీని ఏర్పాటు చేసి తద్వారా ఫండ్‌ను సమీకరించాలని 1987- 88 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. స్థానిక నిమ్మగడ్డ ఫౌండేషన్ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణ కోసం ఒక ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలని అనుకున్నారు. తద్వారా ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువులు, వైద్యం గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు నిర్ణయించారు. రానున్న సంక్రాంతి సంబరాల్లో కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గద్దె శ్రీనివాస్, కాకాని సురేష్, భీమవరపు మధుసూదనరెడ్డి, ఖాదర్ మస్తాన్, వెంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎ(ఉ)త్తి పోతల పథకాలు!

- నిరుపయోగంగా ఒగేరు వాగు, పసుమర్తి ఎత్తిపోతల పథకాలు
- కాపలాదారుడు లేక సామగ్రి చోరీ
- ఆరుతడులకు నీరందక వర్షాలపైనే ఆధారం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపట పట్టణంలోని ఒంగోలు బ్రిడ్జి దగ్గరలో ఒగేరు వాగుపై 08.07. 2003 న రూ.467.37 లక్షల వ్యయంతో నిర్మించిన ఎత్తిపోతల పథకం, పసుమర్రు గ్రామపంచాయతి పరిధిలో నిర్మించిన పసుమర్తి ఎ త్తిపోతల పథకం.. ఈ రెండూ కొంతకాలం రైతులకు ఉపయోగపడ్డాయి. ఆ తర్వాత వీటికి పూర్తి స్థాయిలో ఆలనా పాలనా లేకపోవడంతో ఈ రెండు ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. ఒంగోలు బ్రిడ్జి దగ్గరలో నిర్మించిన ఎత్తిపోతలను గతంలో దీని పునరుద్ధరణ కోసం 07.06.2015లో రూ.44.70 లక్షలతో మరమ్మతులు కూడా చేయించారు. గత కొన్నేళ్లుగా పంప్ హౌస్‌ను ఉపయోగించకపోవడంతో మోటార్లు, పైపలైన్లు, విద్యుత్ తీగలు చోరీకి గురయ్యాయి. విద్యుత్ లైన్లు ఉపయోగంలో లేవని వాటిని మరమ్మతులు చేసి మళ్లీ పూర్తిగా వాడకంలోకి తీసుకు వస్తే తమకు ఉపయోగపడుతుందని చిలకలూరిపేట పట్టణ, పసుమర్రు, చిన్నపసుమర్రు, మానుకొండువారిపాలెం, గుదేవారిపాలెం సగం వరకు, అన్నంబొట్లవారి పాలెం,బొప్పుడి, అనంతవరం, వింజనంపాడు తదితర గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ పథకం కింద ఆయా గ్రామాల రైతులే కాకుండా ఆయకట్టు నీటిని ఉపయోగించుకునే మరి కొన్ని గ్రామాల రైతులు కూడా దీని ద్వారా నీటిని పత్తి, మిర్చి,కంది తదితర పంటలకు ఆరుతడికి వాడుకునే వారు. మొత్తం ఏడె నిమిది గ్రామాలకు గాను వ్యవసాయ సాగు పొలము 8 నుంచి 10 వేల ఎకరాలుగా ఉంది. మొత్తం ఆయకట్టులో కొంత పొలం ఎస్సి రైతులు 32 మంది 170 ఎకరాల్లో, ఎస్టీ రైతులు 22 మంది 48 ఎకరాల్లో, బిసి రైతులు 150 మంది 470 ఎకరాల్లో, ఒ.సి లు 867 మందికి 2012 ఎకరాలకు అంటే మొత్తం లబ్ధిదారులు 1171 మందికి 2 వేల 7 వందల ఎకరాలలో సొంతగా పొలము కలిగిన లబ్ధిదారులకు ఉచితంగా నీరిచ్చేలా, మిగిలిన నీరు ఆరు తడులకు ఒక ఎకరాకు ఒకసారి ఈ నీరిచ్చే ప్రణాళికతో ఈ ఎత్తి పోతల పథకాన్ని నిర్మించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించడమే కాకుండా పూర్తి స్థాయిలో వివరాలను పంపు సెట్ గోడలపై కూడా పొందుపరిచారు. గత మూడేళ్లుగా పొలాలకు నీరు ఇవ్వకుండా, మరమ్మతులు చేయించకుండా ఈ ఎత్తిపోతలను ఉత్త పోతల పథకంగా మార్చేశారు. కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. మెట్ట పొలాలకు, ఆరుతడులు నీరు లేదని రైతులు వాపోతున్నారు. మాగాణి సంగతి సరే సరి. నీరు పారుదల లేకపోవడంతో కొద్దిపాటి ఎకరాలలో సాగులో ఉన్న మాగాణిని పూర్తిగా మెట్ట పొలాలుగా రైతులు మార్చే శారు.

ఇదే గ్రామ పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల దగ్గర ఉన్న రెండో ఎత్తి పోతల పథకానికి కూడా గత మూడేళ్ల నుంచి మరమ్మతులకు నిధులు లేక నీరు కార్చారు. దీని కింద 5,900 ఎకరాల ఆయకట్టు పొలాలు ఉన్నాయి. ఏడాదికి రెండు పంటలు పండించే రైతు, ప్రస్తుతం ఒక పంటనే పండిస్తున్నారు. పూర్తిగా వర్షాధారం పైనే ఆధారపడే పరిస్థితి. నీరు పుష్కలంగా ఉన్నా, సకాలంలో సాగునీరు అందక పంటల దిగుబడులు తగ్గుతున్నాయని, కౌలు ధర ఎక్కువగా ఉందని, కనీసం రెండో పంటకు అవకాశం ఉంటే కౌలు గిట్టుబాటు అవుతుందని ఆయకట్టుల రైతులు అంటున్నారు. ముఖ్యంగా వాణిజ్య పంట మిర్చిని వేయలేక పోతున్నామం టు న్నారు. ఈ రెండు ఎత్తి పోతల పథకాల వద్ద ఎక్కడా వాచ్‌మెన్‌లు లేరు. ఇవి పని చేయకపోవడంతో విద్యుత్ తీగలు,పలు రకాల వస్తువులు చోరీకి గురయ్యాయి.

ఒగేరు వాగు ఎత్తిపోతలను పునరుద్ధరించండి

రైతు శేషయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ప్రత్తి పంటతో సరిపెట్టు కోవాల్సి వస్తోందని చెప్పారు. ఇప్పటికైనా ఒగేరు వాగు ఎత్తిపోతల పథ కాన్ని పున రుద్ధరించాలని కోరారు. గతంలో వీటికి కాపలాదారులు ఉండేవారని ప్రస్తు తం ఎవరూ లేకపోవడంతో వస్తువులు చోరీకి గురవుతున్నట్లు చెప్పారు.

నాపరాయి లారీ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడికి నివాళు లర్పిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పసర్లపాడును వెంటాడుతున్న ప్రమాదాలు

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని పసర్లపాడు గ్రామాన్ని ప్రమాద మరణాలు వెంటాడుతున్నాయని, దీంతో ఆయా కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి అచేతన స్థితిలో ఉండిపోతున్నాయని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తెల్లవారుజామున రేపల్లె సమీపంలో నాపరాయి లారీ ప్రమాదంలో మృతి చెందిన పఠాన్ వలి, చెన్నకేశవులు, సాంబశివరావు చెందిన కుటుంబీకులను ఆదివారం ఆయన పరామర్శించారు. చిన్నారులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని చెప్పారు. గత సంవత్సరము సెప్టెంబర్ 4న ఇదే గ్రామానికి చెందిన నాపరాయి కార్మికులు ముగ్గురు నకరి కల్లు వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సం ఘటన ఈ సందర్భంగా గుర్తు చేశారు ప్రభుత్వ పరంగా సహాయం అందజేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

గోడ రాతలను పరిశీలిస్తున్న రైతు సంఘం, సిపిఐ నాయకులు

రాష్ట్ర రైతు సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర రైతు సమ్మేళనం జూన్ 13, 14, 15 తేదీలు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ పిలుపునిచ్చారు. సమ్మేళనం జయప్రదం చేయాలని రాష్ట్ర రైతు సమ్మేళనం వాల్ రైటింగ్స్ (గోడ వ్రాతలను) శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కె.వి.వి ప్రసాద్ మాట్లాడుతూ జూన్ 13 నుండి 15 వరకు నరసరావుపేటలో జరిగే రైతు సంఘం రాష్ట్ర స్థాయి సమ్మేళనాలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘ కోశాధికారి సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, ఆహ్వాన సంఘంప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

అన్ని వర్గాల ప్రజల సంక్షేమం అభివృద్ధే వైసిపి లక్ష్యమని, కుల,మత పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. రొంపిచర్ల మండలం విప్పర్లరెడ్డిపాలెంలో రెండవ రోజైన ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గ్రామంలో రూ.40 లక్షల తో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారం భించారు. కార్యక్రమంలో ఎంపిపి గడ్డం వెంకట్రావు, జట్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి, ఏ.ఎం.సి చైర్మన్, ఎంపీటీసీలు, సర్పంచ్ లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

పెదకూరపాడులో..

ప్రజాశక్తి - గుంటూరు, పల్నాడు జిల్లాల విలేకర్లు

సామాజిక ఉద్యమ నిర్మాత ఎన్టీఆర్ అని పెదకూరపాడు గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు అన్నారు. మండల టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం పెదకూరపాడులో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.రాంగోపాలరావు, బి.ఆంజనేయులు, ఎం.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. **రెంటచింతల:** ఎన్టీఆర్ శతజయంతిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రమైన రెంటచింతలలోనే బస్టాండ్ సెంటర్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు.అలాగే,తుమ్మరకోటలో కూడా శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. పల్నాడు జిల్లా టిడిపి రైతు విభాగం కార్యదర్శి చెరెడ్డి కృష్ణారెడ్డి, టౌన్ అధ్యక్షులు మూలి రాజారెడ్డి మాజీ ఎంపీటీసీ శివయ్య పుల్లారెడ్డి పాల్గొన్నారు.**అచ్చంపేట:** అచ్చంపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ బీసీ నాయకులు తిరువాయిపాటీ ఆంజనేయులు వేడుకలకు అధ్యక్షత వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. అదేవిధంగా రాయుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని భోజ

మంగళగిరిలో

నాలు ప్యాకెట్లు పంపిణీ చేశారు. **అమరావతి:** టిఎన్‌టియుసి కార్పెంటర్ విభాగం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అమరావతి మండలంలోని నరుకుళ్ళపాడులో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షులు సుంకర. సురేష్

తెనాలిలో..

కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కి ప్రత్యేకంగా గుడి ఏర్పాటు చేసి అందులో తారక రాముని ఫోటో ఏర్పాటు చేసి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. **తెనాలి:** తెలుగుజాతి గొప్పతనాన్ని దేశ నలుదిశలూ చాటిన గొప్ప వ్యక్తి నందమూరి తారక రామారావు అని పలువురు టిడిపి నేతలు అన్నారు. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా పట్టణ టిడిపి కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షులు టి.హరిప్రసాద్ అధ్యక్షతన ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించి, కేక్‌ను కట్ చేశారు. స్థానిక పెమ్మసాని థియేటర్‌లో ఎన్టీఆర్ శతాబ్ధి ఉత్సవాల నేపథ్యంలో సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ సారధ్యంలో వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు ఈదర వెంకటపూర్ణచంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని హ్యాపి హాస్పిటల్ అధినేత డాక్టర్ యు.పవని ప్రియాంక ప్రారంభించగా పలువురు రక్తదానం చేశారు. **మంగళగిరి:** స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి జెండాలను ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు డి.రాజు, టి.పార్ధసారధి ఆవిష్కరించారు. ఎన్‌టిఆర్, డాక్టర్ ఎమ్మెస్ఎస్ విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. కొత్త బస్టాండ్ సెంటర్‌లో విగ్రహాలకూ పూలమాలలేశారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకిదేవి మాట్లాడారు. 8వ వార్డులోని డాక్టర్ ఆంజనేయ కాలనీ బోరింగ్ పంపు సెంటర్ వద్ద విగ్రహానికి నాయకులు ఎ.వీరాంజనేయులు పూలమాలలేశారు. **పెదనందిపాడు:**ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సీనియర్ నాయకులు రావి శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో సోమేశ్వర దేవస్థాన ప్రాంగణంలోని గీతా మందిరంలో రాష్ట్రస్థాయి పౌరాణిక పద్య పఠన పోటీలు నిర్వహించారు. తొలుత పెదనందిపాడులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాత బస్టాండ్ సెంటర్లో అన్నదానం చేశారు. **తాడేపల్లి రూరల్:** కుంచరపల్లిలోని టిడిపి మండల కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు కె.కోటేశ్వరరావు, టిడిపి ప్రధాన కార్యదర్శి బి.రమేష్, సీనియర్ నాయకులు కె.మహేష్, తెలుగు మహిళ మండల అధ్యక్షులు బి.కృష్ణ వందన, డి.అరుణ, తెలుగు యువత నాయకులు ఎం.అబ్రహం, కృష్ణబాబు, కె.మాణిక్యాలరావు, వేళంగిణి బాబు పాల్గొన్నారు. **చేబ్రోలు:**చేబ్రోలు, వడ్లమూడి, నారాకోడూరు, వేజండ్ల గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. చేబ్రోలు సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గర కేక్‌ను కట్ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

వైసిపి సోషల్ మీడియా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై జనసేన ఫిర్యాదు

ప్రజాశక్తి-తెనాలి

వైసిపి సోషల్ మీడియా ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చిగొట్టే విధంగా వ్యయహరిస్తోందని, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కించపరుత్తూ ఏర్పాటు చేసిన ఫెక్సీయే ఇందుకు నిదర్శనమని జనసేన నాయకులు పేర్కొన్నారు. స్థానిక గంగానమ్మపేట వంతెనపై వైసిపి సోషల్ మీడియా పేరిట శనివారం ఓ ఫ్లెక్సీ వెలిసింది. ఆ ఫ్లెక్సీలో పెదవారికి సిఎం జగన్ అండగా ఉన్నట్లు, పల్లకీలో చంద్రబాబునాయుడు, లోకేష్ కూర్చున్నట్లు, ఆ పల్లకీని జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఈటివి అధినేత రామోజీరావు, ఎబిఎన్ ఆంధ్రజ్యోతి ఎమ్‌డి రాధాకృష్ణ మోస్తున్నట్లు చిత్రీకరించారు. 'పెత్తందార్లు వర్సెస్ పేదలకు మధ్య జరుగుతున్న క్లాస్ వార్' అంటూ టైటిల్ పెట్టారు. ఈ ఫ్లెక్సీ జనసేన అభిమానుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందని, దీంతో పార్టీ అభిమానుల మధ్య గొడవలు జరిగే ప్రమాదం ఉందని, తక్షణమే తొలగించకుంటే ఆందోళన తప్పదని త్రీటౌన్ సిఐ యు.శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు టి.వెంకటరమణరావు, బి.రవికాంత్, షేక్ కాలేషా, ఎ.హరికృష్ణ, జాకీర్ అహ్మద్, పి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడు ఏసు మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పంచాయతీగా ఉన్నప్పటి నుంచి సీనియర్ పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న ఇసుకపల్లి యెహోషువా (ఏసు) శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఏసు మృతికి సిపిఎం రూరల్, పట్టణ కార్యదర్శులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, సుందరయ్య సాంస్కృతిక సేవా సమితి కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి, ఇసుకపల్లి ఇస్సాకు, వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, మేకా అంజిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.మహాలక్ష్మి, నాగమల్లేశ్వరరావు, దొంతిరెడ్డి ప్రకాష్‌రెడ్డి, మేస్త్రీ హనుమంతరావు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానూభూతి తెలిపారు.

దళితులంతా జగన్ వెంటే : కనకారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

దళితులంతా జగన్ వెంటే ఉన్నారని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు అన్నారు. ఆదివారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ సంక్షోభంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏం మాట్లాడాలో తెలియక దళితులంతా తన వెంట ఉన్నారని చెప్పుకుంటున్నారని విమర్శించారు. మహానాడులో ఎస్‌సి సంక్షోభంపై మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఖండిస్తున్నామన్నారు.

నిడమర్రు, నవులూరులో టిడ్కో ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నిడమర్రులో ఇళ్ల పట్టాల పంపిణీ సభలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

నిడమర్రులో సుమారు 4 ఎకరాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్ల పట్టాలను నిడమర్రు, నవులూరు గ్రామాల్లో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిడమర్రు వైయస్సార్ జగనన్న నగర్ నందు 544 ఫ్లాట్లు నిర్మించగా లోన్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి 430 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చామని చెప్పారు. ఇంకా 114 మందికి లోన్ రావడం లేదని, సివిల్ స్కోర్ సమస్య వల్ల ఈ సమస్య వచ్చిందని చెప్పారు. త్వరలోనే బ్యాంక్ వారితో మాట్లాడి ఆ సమస్యలు పరిష్కరించి మిగిలిన వారికి కూడా ఇళ్ల పట్టాలిస్తామని అన్నారు. నవులూరు టిడ్కో లే అవుట్‌లో 672 ప్లాట్లు నిర్మించగా ఇందులో 563 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామని, మరో 109 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ జరగలేదని, బ్యాంక్, టిడ్కో అధికారులతో మాట్లాడి వారికి కూడా ఇళ్లు రిజిస్ట్రేషన్ చేస్తామని వివరించారు. లబ్ధిదారులందరూ తమకు కేటాయించిన ఇళ్లలో అన్ని వసతులు సక్రమంగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని, సమస్య ఉంటే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఇళ్లల్లో కబోర్డులు చేయించుకోవడానికి గాళ్లు కొట్టడం, గోడలు పగలగొట్టడం వంటివి చేయొద్దని, దీనిపై అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఇళ్ళకు సంబంధించి విద్యుదీకరణ స్విచ్చులను ఎమ్మెల్సీ ఆన్ చేసి ప్రారంభించారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి 'అపుస్మా' కృషి

ప్రజాశక్తి - గుంటూరు

ఎమ్మెల్సీలను సత్కరిస్తున్న నాయకులు

నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపుస్మ) పూర్తిస్థాయిలో సహకరిస్తున్నదని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవి రామచంద్రారెడ్డి అన్నారు. అపస్మా ఉమ్మడి గుంటూరు జిల్లా సర్వసభ్య సమావేశం అపుస్మ జిల్లా అధ్యక్షులు బి.పోతిరెడ్డి అధ్యక్షతన స్థానిక గోరంట్ల కెనడి నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన అపుస్మ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రామచంద్రారెడ్డి, గుంటూరు-కృష్ణా జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి, తూర్పు రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ పి.రామచంద్రశేఖర్‌రెడ్డిని సత్కరించారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జాతీయంగా 'నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అసోసియేషన్'లో భాగమైన 'అపస్మా' జాతీయ, రాష్ట్రస్థాయిలో విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుటోందని చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసి విష్ణుప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 14 వేల పాఠశాలల సభ్యత్వంతో అపుస్మ ప్రభుత్వ విధానాలను సమన్వయం చేసుకుంటూ బలీయాంగా ఉన్నదన్నారు. అన్ ఎయిడెడ్ పాఠశాలల రెన్యువల్ గుర్తింపు మూడేళ్ల నుండి ఎనిమిదేళ్లకు పెంచినట్లు చెప్పారు. సమావేశంలో అపస్మా రాష్ట్ర నాయకులు ఎంబిఎస్ శర్మ, ఎంవి రావు, పాఠశాల విద్య ఆర్‌జెడి విఎస్ సుబ్బారావు, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కమిటీ నాయకులు నాయుడు చక్రనాగ్, కె.శ్రీకాంత్‌బాబు, కాటూరి వెంకటేశ్వరరావు ఎస్.సాంబిరెడ్డి, మస్తాన్‌రావు, పి.సాయిబాబు ఎమ్‌డి మున్ను, పిజెఎన్ ధన్, పాఠశాలల కరస్పాండెంట్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కుటుంబరావుకు పలు సంఘాల నివాళి

ప్రజాశక్తి - గుంటూరు

కుటుంబరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) రాష్ట్ర నాయకులు ఎల్‌వి కుటుంబరావు ప్రథమ వర్ధంతి సభ స్థానిక అరండల్‌పేట 10/3లోని మాధాల నారాయణ స్వామి భవనంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. పిఒడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.విష్ణు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎన్‌వి.కృష్ణ మాట్లాడుతూ కుటుంబరావు 1989లో విజయవాడ ప్రభుత్వ ఐటిఐ కాలేజీలో చేరిన తరువాత పిడిఎస్‌యుపట్ల ఆకర్షితుడై క్రియాశీలకంగా పని చేశారని, 2000లో విజయవాడ నగరంలో ప్రగతిశీల ఆటో కార్మిక సంఘ నిర్మాణం, ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. ఆటో కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేశాడన్నారు. ప్రస్తుత రాజకీయాలపై మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ కార్మిక హక్కులను కాల రాస్తోందని, 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు. ఆదాని, అంబానిలకు దేశ సంపదను కట్టబెడుతోందన్నారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభానికి రాష్ట్రపతికి ఆహ్వానం పంపక పోవడం ఆర్టికల్ 79ను ఉల్లంఘించడమేనని అన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యు.గనిరాజు, ఆర్.శ్రీను, టి.నాగేశ్వరరావు, సాయి వరప్రసాద్, జి.శ్రీను, శేఖర్, వాసు, రాము పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం పార్కులో ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - మంగళగిరి

పర్యావరణ పరిరక్షణపై అటవీశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ హిత జీవనశైలిపై పట్టణంలోని పార్కులో అవగాహన కార్యక్రమం నిర్వహించడంతోపాటు సందర్శకులతో ప్రతిజ్ఞ చేయించారు. దిన చర్యల్లో సాధ్యమైనన్ని మార్పులు చేసుకుంటానని, కుటుంబాన్ని, స్నేహితులను, ఇతరులను పర్యావరణ అనుకూల అలవాట్లు అలవర్చుకునే దిశగా ప్రేరేపిస్తానని పలువురు ప్రతిజ్ఞ చేశారు.

సత్యనారాయణ లలితాంబ దంపతులకు సత్కారం - పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధ్యాన మందిరంలో తెనాలి పావులూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ ఆదర్శ జీవన యానం లఘు చిత్ర ప్రదర్శనతో పాటు ఆయన పై రాసిన 'కర్మయోగి' పుస్తకాన్ని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార రంగం నుండి భారత ధార్మిక విజ్ఞాన పరిషత్ స్థాపించి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేలాది ఆధ్యాత్మిక, దైవ చింతన కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాల బొల్లేపల్లి సత్యనారాయణ దంపతుల ఆధ్యాత్మిక, ధార్మిక జీవనాన్ని కొనియాడారు. కార్యక్రమానికి పావులూరి ట్రస్ట్ చైర్మన్ పావులూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, బి.ఉమామహేశ్వరరావు, వి.సత్యనారాయణ, డాక్టర్ డిఎన్ దీక్షిత్, డాక్టర్ కె.రంగనాయకి, కూర్మనాథ స్వామి, పారిశ్రామికవేత్తలు సిహెచ్.రమేష్, బలరామకృష్ణయ్య, ఎస్.కోటేశ్వరరావు, వివిఐటి చైర్మన్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

అన్న ప్రసాదం కోసం విరాళం

ప్రజాశక్తి - పెదకాకాని

స్థానిక శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో 1, 2, 3 తేదీల్లో నిర్వహించే మహాకుంభాభిషేకం సందర్భంగా అన్న ప్రసాద వితరణ కోసం రూ.లక్ష విరాళాన్ని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు శాంతినగర్‌కు చెందిన కుతాడ ప్రవీణ్ కుమార్, లక్ష్మీప్రసన్న దంపతులు ప్రకటించారు. ఈ మొత్తాన్ని దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎన్.శ్రీనివాస్‌రెడ్డికి అందించారు.

విరాళాన్ని అందిస్తున్న దాతలు

పిస్టల్ షూటింగ్‌లో జిల్లా క్రీడాకారునికి పతకం

ప్రజాశక్తి - మంగళగిరి

అనంతపురంలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో గుంటూరు జిల్లా క్రీడాకారుడు ప్రతిభ చూపాడు. పిస్టల్ షూటింగ్ 10 మీటర్లు, 25 మీటర్ల వ్యక్తిగత విభాగంలో మంగళగిరి కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఉద్యోగి తోట శ్రీనివాసరావు బంగారు పతకం సాధించాడు. ఆయనకు ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్ బంగారు పతకం బహుకరించారు.

పతకాన్ని అందుకుంటున్న తోట శ్రీనివాసరావు

స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

- 10లోగా తనిఖీకి రావాలి
- అటెండర్లను ఏర్పాటు చేసుకోవాలి
- రవాణశాఖ వార్షిక ఆదాయం లక్ష్యం రూ.403 కోట్లు
- ప్రజాశక్తితో జిల్లా రవాణా అధికారి కరీం

జిల్లాలోని విద్యా సంస్థలకు చెందిన బస్సులన్నింటికి జూన్ 10వ తేదీలోగా తనిఖీ చేయించుకుని సామర్థ్యం (ఫిట్‌నెస్) ధ్రువీకరణ పత్రం తప్పని సరిగా తీసుకోవాలని జిల్లా రవాణా అధికారి షేక్ కరీం తెలిపారు. ప్రతిబస్సులో అటెండరును తప్పకుండా నియమించుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. ఫిట్‌నెస్ లేని బస్సులను 10వ తేదీ తరువాత తనిఖీ చేసి సిజ్ చేస్తామని వెల్లడించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

జిల్లాలో విద్యా సంస్థల బస్సులు ఎన్ని ఉంటాయి?

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2 వేలకుపైగా ఉన్నాయి. నూతన గుంటూరు జిల్లాలో 900 వరకు ఉన్నాయి. ఇప్పటి వరకు 350 బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ పూర్తి చేశాం. ఈ ప్రక్రియ కొనసాగుతోంది. 10వ తేదీలోగా ప్రతి బస్సుకు సామర్థ్యం తనిఖీ తప్పసరని ఇప్పటికే సంబంధిత యాజమాన్యాలకు తెలియజేశాం. మరమ్మతులుంటే పూర్తి చేసుకునే ఫిట్‌నెస్ పరీక్షకు తీసుకురావాలి. పిల్లల భద్రత దృష్ట్యా ప్రతి బస్సులో విద్యార్థులను దించడానికి, ఎక్కించడానికి అటెండరు తప్పకుండా ఉండాలి. బస్సు డ్రైవర్లకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలను చేయించాలి. ఈ అంశంపై యాజమాన్యాలు దృష్టి సారించాలి. విద్యా సంస్థల బస్సులకు కూడా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం.

నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై తనిఖీలు

జిల్లాలోని వేర్వేరు ప్రదేశాల్లో నిత్యం తనిఖీలు చేస్తుంటాం. ఈ తనిఖీల ద్వారా నెలకు రూ.1.20 కోట్ల వరకు ఫైన్ల రూపంలో ఆదాయం వస్తుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కంటే ఎక్కువ మంది ప్రయాణికులున్నా, లైసెన్సు, వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకున్నా జరిమానాలు విధిస్తాం.

రవాణశాఖ ద్వారా ప్రభుత్వానికి ఆదాయ లక్ష్యం?

జిల్లాలో 2022-23లో రూ.321 కోట్ల లక్ష్యం నిర్ధేశించగా రూ.261 కోట్ల ఆదాయం వచ్చింది. 2023-24లో రూ.403 కోట్ల ఆదాయం రాబట్టాలని లక్ష్యంగా నిర్ధేశించారు. వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజు, త్రైమాసిక పన్నులు, రెన్యువల్స్, లైఫ్ టాక్సు తదితర అంశాల ద్వారా లక్ష్యం మేరకు ఆదాయం రాబట్టడానికి కృషి చేస్తున్నాం. వాహనాలపై పన్నులను ఇటీవల ప్రభుత్వం పెంచింది. 25 శాతం వరకు పెరిగింది. ఈనెల 15 నుంచి కొత్త పన్నులు అమలులోకి వచ్చాయి. వచ్చే త్రైమాసికం నుంచి పెంచిన పన్నులను వసూలుచేస్తాం.

ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు?

ప్రమాదాల నివారణకు ప్రతినెలా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. కళాశాలలు, కూడలి ప్రదేశాల్లో రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరిస్తున్నాం. రహదారి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాట్లాడుతున్న సేవాకుమార్

అవయవదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-గుంటూరు

అవయవ దానం చేయటం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న కొంతమందిని కాపాడగలుగుతామని సర్వీసు హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ టి.సేవాకుమార్ అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఒలో మానవత సంస్థ ఆధ్వర్యంలో అవయవదానం అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చనిపోయిన వారి మృత శరీరాలు వైద్యకళాశాలలకు ఇవ్వటం వల్ల విద్యార్థులు వారి పరిశోధనకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రస్తుత ఆధునిక యుగంలో అవయవ మార్పిడి సులభతరం అయ్యిందన్నారు. బతికి ఉన్న వారు కూడా లివరు, కిడ్నీ లాంటి కొన్ని అవయవాలు దానం చేయొచ్చని వివరించారు. సమావేశానికి మానవత సంస్థ అధ్యక్షులు నల్లమోతు రామారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ తమ సంస్థ నగరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అవయవదానంపై కూడా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పట్టు పరిశ్రమ అదనపు డైరెక్టర్ సిహెచ్.అరుణకుమారి అవయవదానం, రక్తదానం ప్రాధాన్యతను వివరించి, మానవత సంస్థకు రూ.10 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ పి.రమేష్ ప్రసంగించారు. అనంతరం మార్చురీ వాహనానికి రూ.2 లక్షలు విరాళం ఇచ్చిన వి.వి.నాగిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ సంస్థ అధ్యక్షులు ఎన్.అరవింద్, లోక్‌సత్తా నాయకులు యు.సదాశివరావు, మానవత సంస్థ కార్యదర్శి వై.రమణబాబు, డైరెక్టర్ ఉప్పాల సాంబశివరావు పాల్గొన్నారు.